క్లుప్తంగా

నేడు ఆల్ సోల్స్ డే

కడప రూరల్: ఆల్ సోల్స్ డే సందర్భంగా కడప నగరంలో క్రైస్తవుల సమాధుల తోటలో శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు వరల్డ్ పీస్ అంబాసిడర్ ఆఫ్ క్రైస్ట్ చైర్మెన్ బిషప్ శామ్యూల్‌బాబు తెలిపారు. కొత్త రిమ్స్ సమీపంలోని క్రైస్తవుల సమాధుల తోటలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు మాసాపేటలోని దొరల గోరీల వద్ద మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలుటాయని పేర్కొన్నారు.

గణితంలో డాక్టరేట్


వెంకట సుబ్రహ్మణ్యం

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం అనువర్తిత గణిత శాస్త్ర పరిశోధకుడు పి.వెంకటసుబ్రహ్మణ్యంకు అనువర్తిత గణిత శాస్త్ర (అప్లైడ్ మ్యాథ్స్) విభాగంలో విశ్వ విద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆచార్య జి.కాత్యాయని పర్యవేక్షణలో అప్లైడ్ మ్యాథ్స్‌లో కన్వెక్టివ్ హీట్ అండ్ మాస్ ట్రాన్స్ఫర్ ఫ్లో ఆఫ్ నానోఫ్లూయిడ్స్ అంశంపై ఆయన చేసిన పరిశోధనకుగానూ ఈ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ప్రొఫెసర్. కె.ఎస్.వి.కృష్ణారావు ప్రకటించారు. ఆయన పరిశోధన ఆటోమొబైల్ పరిశ్రమ, రసాయన పరిశ్రమ మరియు మురుగునీరు శుద్ధీకరణలో అనేక అనువర్తనాలను (ఉపయోగాలు) కలిగి ఉందన్నారు.

రేపు అన్నపూర్ణ క్షేత్రంలో ధర్మకర్తల ఎన్నిక

కడప కల్చరల్: కడప నగర శివారుని రామచంద్రయ్యనగర్ అన్నపూర్ణ నిత్యాన్నదాన క్షేత్రంలో ఆదివారం ఉదయం పది గంటలకు ధర్మకర్తల సమావేశం, నూతన కమిటీ ఎన్నిక నిర్వహిస్తామని నిర్వాహకులు గండ్లూరి నారాయణ రావు తెలిపారు. జిల్లాలోని 36 మండలాల్లోని వేయి దేవాలయాల నిర్వాహకులతో ఆదివారం సమావేశం నిర్వహిస్తున్నామని, అక్కడే రేపు అన్నపూర్ణ క్షేత్రంలో ధర్మకర్తల కమిటీలను ఎన్నుకుంటామని పేర్కొన్నారు.

పరీక్ష ఫీజులు తగ్గించాలి


రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

వైవీయూ: ప్రొద్దుటూరు పట్టణంలోని వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కాలేజ్ ఆఫ్ వైవీయూలో పరీక్ష ఫీజులను తగ్గించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ కోరారు. వైవీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మను కలిసి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ కళాశాలలో 1 నుంచి 4వ సెమిస్టర్ వరకు పరీక్ష ఫీజు రూ.2500/- చొప్పున చెల్లించాల్సి వస్తోందన్నారు. తగ్గించి విద్యార్థులపై భారం తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మోహన్, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

కార్తీక దీపోత్సవానికి ఏర్పాట్లు


దీపాలు పెట్టేందుకు ఏర్పాటుచేసిన బండలు

కడప కల్చరల్: కార్తీక దీపోత్సవానికి నగరంలోని శివాలయాలు సిద్ధమయ్యాయి. విశాలమైన ప్రాంగణం గల మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు నాగేశ్వరనాయుడు ఆధ్వర్యంలో గేటు ఎదురుగాగల స్థలంలో దీపాలు పెట్టుకునేందుకు ప్రత్యేకంగా బండలు పరిచి సౌకర్యం కల్పించారు. కుడివైపున ప్రసాద వితరణ, అన్నదానం, భక్తుల సామూహిక పూజోత్సవాలకు ఏర్పాట్లు చేశారు.

బ్రౌన్ ఉత్సవాలను ప్రభుత్వమే నిర్వహించాలి

కడప కల్చరల్ : తెలుగు భాషోద్ధారకుడు సీపీ బ్రౌన్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలని సీపీ బ్రౌన్ గ్రంథాలయ సలహా మండలి సభ్యులు జానమద్ది విజయ భాస్కర్ కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఈ మేరకు ఆయన శుక్రవారం లేఖ రాశారు. ఇందులో భాగంగా చంద్రబాబు బ్రౌన్ గ్రంథాలయాన్ని ప్రారంభించిన అంశాన్ని గుర్తు చేశారు. సీపీ బ్రౌన్ జయంతిని యేటా రాష్ట్ర ప్రభుత్వ ఉత్సవంగా నిర్వహించాలని కోరారు.

వ్యక్తి మృతి

పెండ్లిమర్రి : మండలంలోని కొండూరు దళితవాడ గ్రామానికి చెందిన వరపుత్రుడు(40) చికిత్స పొందుతూ మృతి చెందాడు. గత నెల 25వ తేదీన ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చేలరేగి తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కొసం కడప రిమ్స్ నుంచి తిరుపతిలోని ప్రయివేట్ అసుపత్రికి తరలించారు. తిరుపతిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆ కుటుంబంలో విషాధచాయలు అలుముకున్నాయి.

ప్రహారీ చెంతన ప్రమాదం

- ఉర్దూ రెసిడెన్సియల్ పాఠశాలలో ఏడాది కిందట కూలిన గోడ
- పెరిగిన పిచ్చి మొక్కలు, కంప చెట్లలో విష పురుగుల సంచారం


హాస్టల్‌కు వెనుక నీటి గుంతలో చేపలు పడుతున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: ఏడాది కిందట కూలిన ప్రహరీకి మరమ్మతులు చేయకపోవడంతో పిల్లలకు ప్రమాదంగా మారింది. కడప నగర శివారులోని రామాంజనేయపురం వద్ద ఏపీ ఉర్దూ రెసిడెన్సియల్ బాయిస్ స్కూల్ ఉంది. ఈ స్కూల్‌కు చెందిన హాస్టల్ వెనుక వైపు ఉన్న ప్రహరీ కొంతభాగం ఏడాది కిందట కూలి పోయింది. పాఠశాలకు సెలవు వస్తే చాలు.. పిల్లలకు ఆ దారే రహదారిగా మారుతోంది. గోడ అడ్డుగా లేకపోవడంతో పిల్లలు నిత్యం లోపలకు, బయటకు తిరగడం, హాస్టల్ వెనుక వైపునకు వెళ్లి మురికి గుంతలో చేపలు పట్టడం, ఆటలాడుకోవడం చేస్తున్నారు. వసతి గృహం చుట్టూ పిచ్చి మొక్కలు, కంప చెట్లు ఉండడంతో విష పురుగులైన పాములు, తేళ్ల సంచారం ఉంది. ఏదైనా పొరపాటు జరిగినా విద్యార్థులకు ప్రాణాపాయం తప్పదు. ఉన్నతాధికారులు స్పందించి ప్రహారిని నిర్మించాల్సిన అవసరం ఉంది. అంతేగాక ప్రహరీకి అనుకని ఓ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. తినుబండారాలను కొనుక్కొని పిల్లలంతా దాని పక్కనుంచే వెళ్తుండడంతో పొరపాటు జరిగితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. వసతి గృహ సిబ్బంది విద్యార్థులను పర్యవేక్షించకపోగా.. వారితో కలిసి అడ్డ దారిలో బయటకు వచ్చి కలిసి ఎంజాయ్ చేయడం సబబేనా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రిన్సిపాల్ సత్య సోమ సత్యశేఖర్ మాట్లాడుతూ ప్రహరీ కూలి చాలా రోజులైందని.. కొత్త గోడ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. నిధులు రాగానే ప్రహరీ నిర్మిస్తామన్నారు.


టాన్స్‌ఫార్మర్ పక్క నుంచి హాస్టల్‌లోకి వెళ్తున్న విద్యార్థులు

మాజీ సర్పంచ్‌కు మాజీ మంత్రి పరామర్శ


వెంకటసుబ్బయ్యను పరామర్శిస్తున్న మేయర్ సురేష్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఇటీవల చికిత్స చేయించుకుని పాలంపల్లె మాజీ సర్పంచ్ వెంకట సుబ్బయ్యను మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు శుక్రవారం పరామర్శించారు. ఆయనతో పాటు రాజశేఖరరెడ్డి, మహమ్మద్‌షఫీ, మల్లికార్జున, బాలస్వామిరెడ్డి, జయచంద్రారెడ్డి, దాసరిశివ, దేవిరెడ్డి ఆదిత్య, రామ్మోహన్ రెడ్డి, మాధవరెడ్డి, ఎల్లారెడ్డి, రమణ, సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

చర్చి ఉపాధ్యక్షుడి మృతికి మేయర్ సంతాపం


నరసారావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: తెలుగు బాప్టిస్ట్ చర్చి వైస్ ప్రెసిడెంట్ తాలూరి నరసారావు మృతికి మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. కడప నగరంలోని మాసాపేటలోని ఆయన గృహంలో నరసారావు భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రామ్‌లక్ష్మణ్ రెడ్డి, మల్లికార్జున, త్యాగరాజు, తోటక్రిష్ణ, దాసరి శివప్రసాద్, ఎల్లారెడ్డి, దేవిరెడ్డి ఆదిత్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

యువతీ, యువకులు సేవాభావం కలిగి ఉండాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: యువతీ, యువకులు సేవా భావం కలిగి ఉండాలని నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువ అధికారి మణికంఠ పిలుపునిచ్చారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా కడప బాలాజీ నగర్‌లో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. మణికంఠ మాట్లాడుతూ రక్తదానం చేసి పది మందికి సహాయం చేయడం గర్వంగా ఉందని తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ స్పెషల్ ఆఫీసర్ శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ యువత సేవా స్ఫూర్తిని సర్దార్ వల్లభాయ్ పటేల్ నుంచి నేర్చుకోవాలని, రక్త కొరత దృష్టిలో ఉంచుకొని రక్తదానం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకురావాలన్నారు.


రక్తదానం చేస్తున్న యువకులతో అతిథులు, సేవా సమితి ప్రతినిధులు

ఈ కార్యక్రమంలో జేబీవీఎస్ ది ప్రిజర్వర్ సేవా సమితి వ్యవస్థాపకుడు అశోక్, నెహ్రూ యువ కేంద్ర సిబ్బంది ప్రేమ్ కుమార్, కీర్తన, గణేష్, సూర్య, ఆశిక్, రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లపై రాజకీయ వేధింపులు

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఆశా వర్కర్లకు రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ వెల్ సెంటర్‌లో ఆశా కార్యకర్తలతో పారిశుద్ధ్య పనులు చేయించడం సబబు కాదన్నారు. ఏఎన్ఎం ఫీల్డ్ విజిట్ చేయకుండా.. ఆశా కార్యకర్తలతో పనులు చేయిస్తూ పెత్తనం చేయడం తగదన్నారు. వారికి కనీస వేతనాలు చెల్లించి పని భారం తగ్గించాలని, నాలుగు ఆదివారాల సెలవులు అమలుచేయాలని కోరారు. ఆశాలను కార్మికులుగా గుర్తించి అన్ని సైకర్యాలు కల్పించాలని కోరారు. ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రాజామణి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కామనూరు శ్రీనివాసులురెడ్డి

- కాల్వ పూర్తిగాక.. నీరు ముందుకుపోక


ఎస్‌బీఐ కాలనీలోని దిగబడిపోయిన టిప్పర్

కడప కార్పొరేషన్: కడప నగర పరిధిలోని ఎస్‌బీఐ కాలనీతో వర్షం కురిస్తే చాలు నీరంతా నిలిచిపోతోంది. రూ.40 కోట్లతో నిర్మించిన వరద నీటి కాలువ పూర్తి కాకపోవడమే ఇందుకు కారణం. వర్షపు నీరు ఎక్కువకాలం నిల్వ ఉండడంతో ఎత్తు పెంచుకొనేందుకు స్థానికులు మట్టి, రాళ్లు, కంకర తోలించుకుంటున్నారు. వీటిని తోలే టిప్పర్లు కాలనీలోకి ప్రవేశించడంతో సీసీ రహదారులు, పైపులైన్లు దెబ్బతింటున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. కొన్ని మార్లు భారీ వాహనాలు రోడ్లలో దిగబడిపోయిన సందర్భాలున్నాయి. అధికారులు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతన్నారు.

- నీరు వృథా


సంజన్న సర్కిల్‌లో పైపులైన్ లీకేజీ వల్ల వృథా అవుతున్న త్రాగునీరు

కడప కార్పొరేషన్: కడప నగరంలోని సంజన్న సర్కిల్‌లో పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. అక్కడ పైపులైన్ వేసినపుడు తీసిన గుంత సరిగా పూడ్చలేదు. బిల్డింగ్ వ్యర్థాలు గుంతలో వేయడంతో పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. దీంతో నిత్యం నీరంతా వృథాగా పోతోంది. అధికారులు పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేసి, రహదారిపై గుంత పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

టీచర్ల సమస్యలను పరిష్కరించాలని వినతి

కడప ఎడ్యుకేషన్: పాఠశాలల్లో పని చేసే టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్ రెడ్డి కోరారు. డీఈఓ మీనాక్షిని ఆమె కార్యాలయంలో శుక్రవారం కలిసి టీర్ల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలో అపార్ ఐటీలను జనరేట్ చేయడంలో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ఉపాధ్యాయులకు ఇచ్చే ఎఫ్ఎల్ఎన్ శిక్షణను నాన్ రెసిడెన్షియల్ విధానంలో మండల, తాలుకా కేంద్రాల్లో నిర్వహించాలన్నారు. మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లుల మంజూరులో జాప్యాన్ని నివారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ భాస్కర్ రెడ్డి, జిల్లా కౌన్సిలర్లు శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, నారాయణ, రాజారాం, తదితరులు పాల్గొన్నారు.

పీఎస్‌టీయూ వినతి

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యయ సంఘం(పిఎస్‌టియూ) రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. డీఈఓ మీనాక్షికి పీఎస్‌టీయూ పక్షాన శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పీవీ.సుబ్బారెడ్డి, జిల్లా బాధ్యులు అంజనేయులు, రవీంద్రకుమార్, రమణయ్య, ప్రత్యూష, ఖాజామొద్దీన్, రామోహన్‌రెడ్డి, దిలీప్‌కుమార్‌రెడ్డి, మహబూబ్‌బాష, షరీఫ్, బాలిరెడ్డి, లక్షుమయ్య, ప్రదీప్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

పదోన్నతులు సక్రమంగా నిర్వహించాలి

జిల్లా వ్యాప్తంగా త్వరలో జరగబోయే మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతులను సక్రమంగా నిర్వహించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. డీఈఓ మీనాక్షిని శుక్రవారం ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్హతల విషయంలో ఉన్న సందేహాలు తొలగించాలని, అర్హత కలిగిన అందరికీ పదోన్నతులు లభించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో ఖాళీ సబ్జెక్టులకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు సీవీ.రమణ, చెరుకూరి శ్రీనివాసులు, జాస్అహమ్మద్, ప్రభాకర్, కృష్ణారెడ్డి, రూతు ఆరోగ్య మేరీ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యం వద్దు

కడప కార్పొరేషన్: కడప నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో నిర్లక్ష్యం చేయవద్దని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి హెచ్చరించారు. రైతు బజార్, రాధాక్రిష్ణ నగర్, మున్సిపల్ గ్రౌండ్ ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎక్కువగా సంచరించే రైతు బజార్‌లో చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రంచేయాలని ఆదేశించారు. 25వ డివిజన్ రాధాక్రిష్ణ నగర్‌లో జరుగుతున్న పింఛన్ల పంపిణీని పరిశీలించారు. అనంతరం మున్సిపల్ మైదానంలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నగరపాలక ఇంజినీరింగ్, శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.


పింఛన్ల పంపిణీ పరిశీలిస్తున్న కమిషనర్

లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేయవచ్చు

కడప ఎడ్యుకేషన్: తాము పనిచేసే ప్రాంతంలో మహిళా ఉద్యోగులు లైగింక వేధింపులకు గురైనప్పుడు పోష్ చట్టం కింద ఫిర్యాదు చేయవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫ్రక్రుద్దీన్ పేర్కొన్నారు. మరియాపురంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు కాన్ఫరెన్స్ హాల్‌లో బ్యాంకు సిబ్బందికి లైగింగ వేధింపుల నిరోధక చట్టం, తదితర అంశాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోష్ చట్టంలోని సెక్షన్-3 గురించి ఆయన వివరించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100, నల్సా పథకం, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, లీగల్ ఎయిడెడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కడప రీజనల్ మేనేజర్ శ్రీనివాసప్రసాద్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు జనరల్ మేనేజర్స్ సంజీవప్ప, గిరి, రాజేంద్రన్, పడగేట్‌వార్, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.


న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి బాబా ఫ్రక్రుద్దీన్

విజయవాడలో ఈ నెల 5న అర్ధ శతాబ్ధ సభ

కడప ఎడ్యుకేషన్: విజయవాడలోని ఎంబీవీకే భవన్‌లో ఈ నెల 5వ తేదీన నిర్వహించనున్న పీడీఎస్‌యూ 50 ఏళ్ల అర్ధ శతాబ్దోత్సవ సభను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ నాయకులు ముబారక్ బాషా, వంశీరెడ్డి, దిలీప్ కోరారు. ఇందుకు సంబంధించిన గోడ పత్రికలను శుక్రవారం బాల వికాస్ స్కూల్ డైరెక్టర్, ఆపూస్మ జిల్లా అధ్యక్షుడు గంగయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 ఏళ్ల పీడీఎస్‌యూ ప్రస్థానంలో ఎన్నో విద్యార్థుల సమస్యలకు పరిష్కారం లభించిందన్నారు. అర్ధ శతాబ్ధపు సభను విజయవంతం చేయాలని వారు కోరారు


గోడ పత్రాలను విడుదల చేస్తున్న ఆపూస్మ జిల్లా అధ్యక్షుడు గంగయ్య

యువతి అదృశ్యం

కడప అర్బన్: కడప నగరంలోని నాగరాజుపేటలో ఓ హాస్టల్‌లో ఉంటున్న కమలాపురం మండలం చదిపిరాళ్ల గ్రామానికి చెందిన కొర్రపాటి శ్రీమంతి(29) గత నెల 10వ తేదీ నుంచి కనిపించడంలేదని బంధువులు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కడప వన్‌టౌన్ ఎస్ఐ జి. అమర్‌నాథ్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమె తన స్వగ్రామం నుంచి కడపకు వచ్చి కోటిరెడ్డిసర్కిల్‌లోని ఓ షోరూంలో పనిచేసేందుకు వచ్చి నాగరాజుపేటలోని హాస్టల్‌లో ఉంటోంది.

ఆమె మానసిక పరిస్థితి కూడా సరిగా లేదని కుటుంబసభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు.. కడప వన్‌టౌన్ సీఐ 9121100510, ఎస్ఐ 9121100511, సునీల్: 6301889670లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

దీప కాంతులతో మురిసి.. తారాజువ్వలు మెరిసి

కడప కల్చరల్: తారా జువ్వలు రివ్వుమని ఆకాశానికి ఎగిరాయి. మతాబులు, చిచ్చు బుడ్లు, వెలుగులు చిమ్మాయి. గురువారం వెలుగు జిలుగుల పండుగ దీపావళిని నగర వాసులు అత్యంత వైభవంగా నిర్వహించారు. హిందువుల ఇళ్ల ముంగిట రంగురంగుల ముగ్గులు వేసి దీపాలతో అలంకరించారు. సాయంత్రం ఆరు గంటలకే వీధులన్నీ లక్ష్మీ పటాసుల ధ్వనులతో మార్మోగాయి. అడుగడుగునా పోలీసులు పర్యవేక్షిస్తుండగా, పెద్దల ఆధ్వర్యంలో పిల్లలకట్టలు తెగిన సంతోషంతో టపాసులు కాల్చారు. సుప్రీం కోర్టు ఆదేశాలతో నిర్ణీత వ్యవధిని విధించడంతో పిల్లలు, పెద్దలు పోటీపడి టపాసులు కాల్చారు. మత సహనానికి మారుపేరుగా నిలిచే దీపావళి రోజున టపాసులు కొనేందుకు దుకాణాల వద్ద ముస్లింలు కనిపించారు. అపార్టుమెంట్ల వద్ద పెద్ద సంఖ్యలో బాణసంచా కాల్చడం విశేషం. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

బాలుర వసతి గృహంలో..

ఆశా రేఖ ఫౌండేషన్ సంస్థ చైర్మన్ నెమలిదిన్నె నాగవేణి స్థానిక హోం బాలలతో దీపావళి వేడుకలు నిర్వహించారు. ప్రమాద రహిత టపాసులను పంచి పెట్టారు. కాల్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ప్రకాశ్‌నగర్‌లోని అర్బన్ బాయ్స్ హాస్టల్‌లో 80 మంది చిన్నారులకు స్వీట్లు పంచి పెట్టారు. వారితో కలిసి బాణసంచా కాల్చి సంతోషాన్ని పంచుకున్నారు.


కడప మున్సిపల్ మైదానంలో టపాసుల కొనుగోలు కేంద్రాల వద్ద కిక్కిరిసిన జనం

బాసటలో దీపావళి వేడుక

ఆంధ్ర ప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో దీపావళి వేడుకను నగరంలోని బాసట చిల్డ్రన్ హోంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సమాఖ్య వ్యవస్థాపకులు యామిజాల నరసింహమూర్తి జన్మదినం సందర్భంగా హోంలో చిన్నారుల మధ్య కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ జిల్లా గౌరవాధ్యక్షుడు బ్రాహ్మణపల్లి చంద్రమౌళిశర్మ, జిల్లా అధ్యక్షుడు మూర్తిరాజు సత్యనారాయణశర్మ, ప్రధాన కార్యదర్శి వారణాసి శ్రీధర్‌శర్మ, సాయిమిత్రశర్మ, కౌశిక్‌శర్మ, బాసట సంస్థ నిర్వాహకులు చంద్రమౌళి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.


బాణసంచా వెలుగులు


హౌసింగ్ బోర్డు కాలనీలో టపాసులతో ఓ కుటుంబం ఉత్సాహం


రైల్వేస్టేషన్ రోడ్డులో యువకుల ఉత్సాహం


కుటుంబ సమేతంగా బాణ సంచా కొనేందుకు


ఫ్యామిలీ పాక్‌తో చిన్నారుల ఉత్సాహం


టపాసులు కొంటున్న ముస్లిం సోదరీమణులు

అసాంఘిక కార్యకలాపాలపై పోలీసుల దాడులు

కడప అర్బన్: జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ నెలలో పలు నేరాలపై ముమ్మరంగా దాడులు నిర్వహించి కేసులను నమోదు చేయడంతో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. జిల్లా పోలీసుశాఖ పనితీరుపై గణాంకాలను శుక్రవారం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు.

- జిల్లా వ్యాప్తంగా అక్రమ మద్యం విక్రయాలు, రవాణాపై పోలీసులు దాడులు నిర్వహించి 2384.71 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. 133 కేసుల్లో 139 మందిని అరెస్ట్ చేశారు. నాటుసారా విక్రయాలపై దాడులు చేసి 4.5 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్ట్ చేశారు.
- మత్తు కోసం పెయిన్ కిల్లర్ ఇంజెక్షన్స్ తీసుకుంటున్న 37మందిని గుర్తించి వారికి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. మరోసారి పట్టుబడితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.
- హెల్మెట్ రహిత డ్రైవింగ్ చేస్తున్న ద్విచక్ర వాహనదారులు 4480 మందిపై ఎం.వి యాక్ట్ కేసులు నమోదు చేసి వారికి మొత్తంరూ. 6.04,800 జరిమాన విధించారు.
- బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేస్తున్న 1154 మందిపై కేసులు నమోదు చేశారు. 94 మందిపై కేసులు నమోదు చేశారు.
- గ్యాంబ్లింగ్‌పై ముమ్మరంగా దాడులను నిర్వహించి 44 కేసుల్లో 275 మంది జూదరులను అరెస్ట్ చేసి రూ.7,61,450 నగదును స్వాధీనం చేసుకున్నారు.
- మట్కా బీటర్లు, నిర్వాహకులపై 28 కేసులను నమోదు చేసి 50 మందిని అరెస్ట్ చేసి రూ.3.19 లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నారు.
- ఇసుక అక్రమరవాణాకు పాల్పడుతున్న 75 మందిని అరెస్ట్ చేసి వారిపై 41 కేసులు నమోదు చేసి 577 టన్నుల ఇసుకను, ఇసుకను తరలిస్తున్న 59 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.